

# రాజహంస రెక్కలు విప్పింది

## అమరావతి కథలు

సత్యం శంకరమంచి

అవన్నీ పాలరాయి ముక్కలు.

పాల వెన్నెల రాతిలో ప్రాణాలు పోసుకున్న శిల్పాలు.

వెన్న ముద్దలాంటి శిలల్లో వేణుగానం చేసే కళా ఖండాలు.

కొన్ని వేల సంవత్సరాల క్రితం—

అంటే "మన తాత ముత్తాతలకి ముందునాటి మాట" అంటూ కథ మొదలుపెడ్తే అంత బాగుండదు అని కొందరికి అనిపించవచ్చు. వర్తమానం గొప్పదనీ, భవిష్యత్తులోకి దృష్టి సారించటం ఎంత అవసరమో, మన పూర్వుల కళా ప్రాభవాల్ని మననం చేసుకోడం అంత అవసరమున్నా.

గతం గాలిలో కలిసిపోదు.

గతం మంచి నేటి దాకా గాలి వీస్తూనే వుంది. కృష్ణ పారుతూనే వుంది. గతాన్ని గురించిన కృష్ణ పాడుతుంటే గత కాలపు శిల్పాలు ఆనాటి కథలు చెప్తున్నాయి.

అదుగో! ఆమె యక్షిణి.

ఇంతలేసి కళ్ళతో మనవైపే చూస్తోంది. ఎత్తయిన జుట్టుముడి; పొడవాటి కేశపాశాన్ని పాయలు పాయలుగా చీల్చి మెలికలు మెలికలుగా చుట్టి మల్లె పొదలా నిండుగా ముడివేసింది. ఆ జుట్టు ముడిలో దీపాల్లా పువ్వులు, ముడినంతనీ చుట్టివేసి మరో పూలదండ.

మెడ నొత్తుగా వుంది. మెడనిండా ఆభరణాలు వేళ్ళాడుతున్నాయి. నక్షత్రమాలిక ఎత్తయిన వక్షోజాల మీంచి కటి ప్రదేశం దాకా సాగింది. ముత్యాల పేర్లు గుండెనిండా పరుచుకున్నాయి. రత్నాల హారం కంఠాన్ని కౌగిలించుకుని విడవడం లేదు. కుచ భారానికి నడుం సన్నగిల్లింది. పక్కకి వయ్యా రంగా వొరిగిపోయింది. ఆ వొంగిన వయ్యారపు నడుం మీదగా, యక్షిణీ వామహస్తం. ఆ చేతిలో పూలసజ్జ. కరకంకణాలు మోచేయి దాకా వెలుగు తూంటే, ఆ సజ్జ నిండా రకరకాల పువ్వులు!

ఇంతలేసి కళ్ళతో మనవేపే చూస్తోంది. ఓరయ్యా! వయసు కాదా! నన్ను అబ్బురంతో చూస్తున్న చిన్న వాడా! నే నెవరో తెలుసా? కాగితాలకి, తారీఖులకి అందని సౌందర్యాన్ని, కళ్ళకి కాంతి తెలిసినట్టే, మనసుకు మాత్రమే అనుభవమయ్యే అందాన్ని, ఓ లాగు, చొక్కా వేసుకొన్న నాగరికుడా! నువ్వు రోజూ చూసే స్త్రీ లాంటి దాన్ని కాదే నేను! నన్ను చూసి పొంగిపోతున్నావేల? నన్ను చూసి అవాక్కయి పోతున్నావేల... నేను చరిత్రలోని దీపాన్ని, నన్ను మలచిన వాడు, నాకు రూపమిచ్చి ప్రాణం పోసినవాడు, ఓ భిక్షువు. కాషాయం ధరించి, సర్వసంగ పరిత్యాగం చేసి, బౌద్ధ ధర్మాన్ని మనసా వాచా స్మరించుకునే ఓ సన్యాసి నన్ను ఈ రాతిమీద చెక్కాడయ్యా! ఈ పువ్వులతో వెళ్ళి బుద్ధుడి పాదాలు మెత్తగా అద్దమని, ఈ తనువుతో మోకరిల్లమని నన్నంపుతున్నాడయ్యా! బుద్ధుడి సేవలో నన్ను నియమిస్తున్నాడు కనుక నన్నింత అపురూప సౌందర్యవతిగా తీర్చాడయ్యా! అంతటి స్వామికి అర్పించుకుంటుంటే అపూర్వంగా వుండా లని భావించాడయ్యా! ఈనాటి కళ్ళతో ఆనాటి సత్యాల్ని చూడనయ్యా!

అటు చూశావా! ఆ బొమ్మ!

బుద్ధుడు యశోధర అంతఃపురం నుంచి అర్థ రాత్రివేళ తరలి వెళ్తున్నాడు. కట్టుకున్న భార్యని కాదన్నాడు, కన్న బిడ్డని వొదిలేసుకున్నాడు. జగత్తే తన సంసార మనుకుని, ఈ లోకంలో దుఃఖం నివారించడానికి, శాంతి పూయించడానికి వొంటిగా బయలుదేరాడు బుద్ధుడు. అది మహాభి నిష్క్రమణం, జగత్కళ్యాణానికి నాంది. ఆ ముహూర్తాన అదృశ్యంగా యక్షులు, కిన్నరులు బుద్ధుణ్ణే స్తుతిస్తున్నారు.

రథం బయలుదేరింది. ముందు ముందుకు సాగిపోతోంది. రథాన్నీ లాగుతున్న గుర్రాల గిట్టల కింద సిద్ధులు అరచేతులు పెడ్తున్నారు, ఎందుకు? చప్పుడి కాకూడదు కనుక. గుర్రపు గిట్టల చప్పుడయితే అంతఃపురం మేల్కొనవచ్చు. యశోధర మేల్కొనవచ్చు. రాహులుడు లేచి 'నాన్నా!' అని పిలవ్వొచ్చు. సిద్ధార్థుడిని మోహపాశం బంధించి' వేయవచ్చు. అంచేత ఆ లోక కళ్యాణ యాత్ర నిశ్శబ్దంగా చీకటికి కూడా తెలియ కుండా జరిగిపోవాలి. అందుకే గుర్రపు గిట్టల కింద నలిగిపోయే సిద్ధుల అరచేతులు. త్రేతాయుగంలో జరిగిన రామకళ్యాణం గురించి కూడా ఇలాంటి కథే వుంది. సీతారాముల వివాహానికి ముహూర్తం పెట్టిం దెవరు? అటు వసిష్ఠుడు! ఇటు శతానందుడు! అంతటి మహా ఋషులు నిర్ణయించిన ముహూర్తానికి సీతారాముల కళ్యాణం జరిగితే వాళ్ళిద్దరూ పట్టు మని పదేళ్ళపాటు కలిసి కాపురం చేశారా? నిజానికి ఆ ముహూర్తానికి ఆ వివాహం జరిగితే వాళ్ళకు వియోగం లేదు. వియోగం లేకపోతే రాక్షస సంహారం జరగదు.

## ముత్యాలవాన

అవతార ప్రయోజనం సమకూరదు.

స్వర్గంలో దేవతలు కలతపడ్డారు. ఏం చేయాలో తోచింది కాదు. ఓ అప్సరసని కళ్యాణ మంట పానికి పంపారు. ఆ అప్సరస నృత్యం చేస్తోంది. జనం మైమరచి నృత్యం తిలకిస్తున్నారు. ఆ మైమర పాటు లో ముహూర్తం గడియ తప్పింది. వసిష్ఠుడు, శతానందుడు ముఖాలు ముఖాలు చూసుకొన్నారు. చేసేది లేక దైవ నిర్ణయం అనుకుని తప్పిపోయిన ముహూర్తానికే కళ్యాణం జరిపించారు.

ఆనాడు ఆ ముహూర్తం తప్పిపోవటం ఎంత అవసరమో, ఈనాడు సిద్ధార్థుడి యాత్ర నిశ్శ బ్దంగా జరగటం అంత అవసరం.

రథం సాగిపోతోంది. పరమ రహస్యంగా, పరమ నిశ్శబ్దంగా సాగిపోతోంది. గుర్రాలు సిద్ధుల అరచేతుల మీద పరుగెత్తుతున్నాయి. అప్పుడు నేల తల్లి సిద్ధు లతో అందిట — "నాయనలారా! నా స్వామి లోకకళ్యాణ యాత్రకు వెళ్తున్నాడు. నా స్వామిని మోసే గుర్రాల పాదాల్నయినా నన్నంట నివ్వరేమి" అని.

అప్పుడు సిద్ధులు అన్నారుట, "తల్లీ! ఈ యాత్ర ఇలాగే వెళ్ళాలి. ఆ తర్వాత సిద్ధార్థుడు బుద్ధుడవుతాడు గదా! అప్పుడు స్వామి గుర్రాల కేమి? స్వామి పాదచారియై వుంటాడు గదా! అప్పుడు సేవించుకొందువు గాని" అని.

### కొత్త అవతారం

"ఒకసారి కుంటోడినిగా, మరోసారి గుడ్డి వాడిగా ఇలా రకరకాల వేషాలు వేస్తూ అడుక్కోన డానికి సిగ్గు లేదూ?"

నేనిప్పుడు చెవిటి వాడిని బాబయ్యా! ధర్మం చేయండి! అన్నాడా బిక్షగాడు.

— కె.వి.ఎం.ఆర్. (కాకినాడ)